క్లుప్తంగా

నేడు భీమలింగేశ్వర జాతర

పెదబయలు : పెదబయలు భీమలింగేశ్వర జాతర ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గంపరాయి అజయ్‌కుమార్, గందేరు జీవన్‌కుమార్ తెలిపారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. భక్తులంతా హాజరై స్వామివారిని దర్శించుకుని, తరించాల్సిందిగా కోరారు.

పింఛన్ల పంపిణీ



సొవ్వ పంచాయతీలో పింఛన్ అందిస్తున్న ఎంపీపీ బాక ఈశ్వరి

డుంబ్రిగుడ : రాష్ట్ర ప్రభుత్వం అవ్వ, తాతలకు, వికలాంగులకు, వితంతువులకు అందిస్తున్న వైఎస్సార్ పింఛన్లను బుధవారం మారుమూల సొవ్వ పంచాయతీ మాలివలస గ్రామంలో ఎంపీపీ బాక ఈశ్వరి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలో వచ్చాక, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు ఏటా పింఛన్లను పెంచుతున్నారని కొనియాడారు. ఏ ప్రభుత్వం కూడా పేదలకు ఈ స్థాయిలో మేలు చేయలేదన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బాక సింహాచలం, డీఎంయూ జిల్లా అధ్యక్షుడు కిల్లో సునీల్, గ్రామ వలంటీర్లు కూల్‌ధర్, శ్రీధర్, బిమో పాల్గొన్నారు.

ఎంపీడీవో సచివాలయాల తనిఖీ

గూడెంకొత్తవీధి : మండలంలోని దేవరాపల్లి, సంకాడ, రింతాడ, పెదవలస, లక్కవరపేట సచివాలయాలను గూడెంకొత్తవీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో డ్రాపవుట్స్‌ను గుర్తించడంతోబాటు, గర్భిణుల వివరాలను, వేక్సినేషన్‌కు సంబంధించి ఏఎన్‌ఎంలు ప్రత్యేక రికార్డులను నిర్వహించాలని సూచించారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. పెదవలసలో అమృత్ సరోవర్ కింద ఎంపిక చేసిన ట్యాంకు పనులను పరిశీలించారు.

హైస్కూల్‌ను సందర్శించిన జెడ్పీటీసీ



గంగవరం ఆశ్రమ బాలుర వసతి గృహంలో భోజనం చేస్తున్న జెడ్పీటీసీ బేబిరత్నం

గంగవరం : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను జెడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన బాలురకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహంలో విద్యార్థులతో కలసి భోజనం చేశారు. పాఠశాల హెచ్‌ఎం ఆర్‌వీవీ సత్యనారాయణ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ముత్యాల శ్రీనివాసును వివరాలు అడిగారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీని పరిశీలించారు.

గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్



గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

అడ్డతీగల : పశువుల్లో సంక్రమించే గాలికుంటు వ్యాధి నివారణకు ముందస్తుగా వ్యాక్సిన్లు వేస్తున్నట్టు అడ్డతీగల ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి తరుణ్‌కుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న పశువులకు బుధవారం నుంచి వ్యాక్సిన్‌లు విస్తృతంగా వేస్తామన్నారు. అడ్డతీగల మండలంలోని అధికారిక అంచనాల ప్రకారం 8,900 పశువులు ఉండగా వాటన్నింటికీ గాలికుంటు వ్యాధి సంక్రమించకుండా వ్యాక్సిన్‌లు వేయనున్నట్టు పేర్కొన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలోని పశువైద్య సహాయకులు గ్రామాల్లో పర్యటించి ప్రతి పశువుకు ఈ వ్యాక్సిన్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి మాసాంతం వరకూ ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో షెడ్లతో యువతకు ఉపాధి

- పాకల్లో వ్యాపారం చేస్తున్న గిరిజన నిరుద్యోగ యువత
- గాలులు, వర్షాలతో ఇబ్బందుల మధ్యే వ్యాపారాలు
- తాత్కాలిక షెడ్ల కోసం ఐటీడీఏకు వినతి



కాఫీ ప్లాంటేషన్ వద్ద కర్రలతో ఏర్పాటు చేసుకున్న దుకాణాలు

అనంతగిరి : మన్యం.. చల్లనివాతవరణంతో పాటుగా ప్రకృతి అందాల నిలయం. వీటిని అస్వాదించేందుకు నిత్యం వేలాది సంఖ్యలో పర్యాటకులు మన్యానికి తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలోని ఆయా పర్యాటక ప్రాంతాలకు వచ్చే సందర్శకుల సౌకర్యార్థం స్థానికంగా నిరుద్యోగులైన గిరిజన యువత కాఫీ పౌడర్, చికెన్ కబాబ్ తదితర అమ్మకాలతో జీవనం సాగిస్తున్నారు. మరిన్ని షెడ్లు నిర్మిస్తే మరింత మందికి ఉపాధి దక్కుతుందని స్థానికులు కోరుతున్నారు.

అనంతగిరిలోనే అత్యధిక వ్యాపారం

మన్యంలోని ఇతర మండలాలతో పోలిస్తే అనంతగిరి మండలంలోనే అధిక సంఖ్యలో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. బొర్రాగుహలు, తాటిగుడ, కటికి, చిట్టంపాడు, సరియా జలపాతాలు, కాఫీ ప్లాంటేషన్ తదితర సందర్శనీయ ప్రాంతాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకుల నిమిత్తం, స్థానికంగా ఉంటున్న నిరుద్యోగులు కర్రలతో చిన్నపాటి పాకలు వేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. వీరు ఎక్కువగా బొంగు చికెన్, చికెన్ కబాబ్, కాఫీ పౌడర్, మిరియాలు తదితర అటవీ ఉత్పత్తుల అమ్మకాలు సాగిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కర్రలతో నిర్మించుకున్న పాకలు కావడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు గిరిజనులు వాపోతున్నారు. గాలివానకు పలుమార్లు గుడిసెలు ధ్వంసమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐటీడీఏ స్పందించి, తాత్కాలిక షెడ్ల నిర్మాణానికి కృషిచేయాలని గిరిజనులు విన్నవించుకుంటున్నారు.

షెడ్లు నిర్మించాల్సిన ప్రదేశాలు

మండలంలోని బొర్రాగుహలు, కాఫీ ప్లాంటేషన్, కటికి, తాటిగుడ, సరియా, చిట్టంపాడు జలపాతాలు, డముకు వ్యూ-పాయింట్ తదితర సందర్శిత ప్రాంతాల్లో నిరుద్యోగులు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఒక్కో ప్రదేశంలో 10 నుంచి 25 షెడ్లు నిర్మిస్తే నిరుద్యోగులకు ఉపాధి అవకాశం మెరుగుపడుతుంది. దీంతో వందలాది మంది గిరిజన నిరుద్యోగులకు ఐటీడీఏ అసరాగా నిలిచినట్లవుతుందని పలువురు గిరిజనులు అభ్యర్థిస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



పర్యాటక ప్రాంతాల్లో స్థానిక నిరుద్యోగులైన గిరిజన యువతీ, యువకులు తాత్కాలిక షెడ్ల ఏర్పాట్లపై విన్నవించారు. షెడ్ల నిర్మాణానికి సంబంధించిన సమస్యపై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకునివెళ్తాం. వారి ఆదేశాల మేరకు గిరిజన నిరుద్యోగులకు మేలుజరిగేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీహర్షిత్, ఎంపీడీవో, అనంతగిరి

టీచర్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



ఉపాధ్యాయురాలి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పాడేరు రూరల్ : పాడేరు–పెదబయలు మార్గంలోని చింతలవీధి జంక్షన్ సమీప ఘాట్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఉపాధ్యాయురాలు వాలంగి జయకుమారి కుటుంబ సభ్యులను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పరామర్శించి, ధైర్యం చెప్పారు. టీచర్ మరణవార్త తెలుసుకున్న ఆయన పాడేరు జిల్లా ఆస్పత్రికి బుధవారం చేరుకున్నారు. మృతదేహానికి నివాళులు అర్పించి ఆమె తండ్రి వాలంగి బాబూరావు, భర్త కూడా హనుమంతరావు, ఇతర కుటుంబ సభ్యుల్ని ఓదార్చారు. అనంతరం మృతురాలి స్వగ్రామమైన పెదబయలు మండలం అరడకోట గ్రామానికి చేరుకుని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పరామర్శించిన వారిలో పెదబయలు జెడ్పీటీసీ కూడా బొంజుబాబు, మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ కొంటా సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ పెదబయలు మండల కన్వీనర్ కనకరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత గంపరాయి సూరయ్య తదితరులు ఉన్నారు.

మొక్కజొన్నలో కలుపు నివారణకు సూచనలు



ఇందుకూరుపేటలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త సుజాత

దేవీపట్నం : దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో మొక్కజొన్న పంటలో కలుపు నివారణపై ప్రథమ శ్రేణి ప్రదర్శనలను పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త వి.సుజాత బుధవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో రైతులతో ఆమె మాట్లాడారు. గడచిన మూడేళ్లుగా మొక్కజొన్నలో కలుపు నివారణపై జరిగిన అధ్యయనంలో విత్తిన 15 రోజుల తరువాత ఒక హెక్టార్‌కు 120 గ్రాముల టెంబోట్రియాన్‌లో, 750 గ్రాముల అట్రాజిన్‌ను కలిపి పిచికారీతో ప్రయోజనం ఉన్నట్టు తేలిందన్నారు. మొక్కజొన్నను ఆశిస్తున్న కత్తెర పురుగు నివారణకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రదర్శనలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ రమేష్, ఎస్టీ కమిషన్ సభ్యుడు విశ్వేశ్వరరాజు

కొయ్యూరు : ప్రసవం తరువాత తల్లీబిడ్డలను క్షేమంగా వారి ఇంటికి చేర్చడంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎంపీపీ బడుగు రమేష్, ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. వారు బుధవారం రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రసవాల కోసం దూర ప్రాంతాల నుంచి ఆస్పత్రులకు వచ్చిన వారిని తిరిగి పంపేందుకు ఎలాంటి వాహనాలు ఉండేవి కాదన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లలో క్షేమంగా బాలింతను, పసిబిడ్డను వారింటికి చేర్చుతున్నట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. వాహనాన్ని ప్రారంభించిన అనంతరం రాజేంద్రపాలెంకు చెందిన బాలింత కీర్తిని వారి ఇంటికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఏఎంసీ చైర్మన్ జే రాజులమ్మ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రేగటి ముసిలినాయుడు, సర్పంచ్‌లు సోమన్నదొర, రాజు, నేతలు పాటి శేఖర్, గంగాధర్, ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న వై.రామవరం మండల యూటీఎఫ్ నూతన కమిటీ

వై.రామవరం : వై.రామవరంలో బుధవారం జరిగిన మండల యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. అధ్యక్షునిగా ఎస్.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా పల్లాల లక్ష్మణరెడ్డి, గౌరవాధ్యక్షునిగా బేలుం నూకరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.సూరన్నదొర, మహిళా ప్రెసిడెంట్‌గా పి.దుర్గాప్రసన్న, కోశాధికారిగా ఎం.మల్లయ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శిగా ఆర్.హరితకుమారి, ఆడిటర్‌గా ఎమ్‌డి ప్రసాదు, మండల కార్యదర్శులుగా కృష్ణారెడ్డి, దేవిరెడ్డి, శిరీషరాణి, ఎమ్.సత్యన్నారాయణ, కె.చిన్నయ్య, కిరణ్, జిల్లా కౌన్సిలర్లుగా పి.చిన్నవిశ్వరెడ్డి, పి.గంగాధరరెడ్డి, కె.గోపాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సంఘ జిల్లాకార్యదర్శి సార్లం రాజబాబు వ్యవహరించారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.మంగరాజు, ఎం.రమేష్‌బాబులు ఎన్నికల పరిశీలకులుగా ఉన్నారు. అనంతరం నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు.

ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్ గెలుపు తథ్యం



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మండల మహిళాధ్యక్షురాలు శాంతి



గురుకుల కళాశాలలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ, ఇతర నేతలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న హుకుంపేట జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం



కిల్లంకోట గ్రామంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డుంబ్రిగుడ : వైఎస్సార్ సీపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయం తథ్యమని స్థానిక నాయకులు ధీమా వ్యక్తం చేశారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు బుధవారం అరమ పంచాయతీ కేంద్రంతో పాటుగా వివిధ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సీతంరాజు సుధాకర్‌ను తమ తొలి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ సద్దు, బాబూరావు పాల్గొన్నారు.

కొయ్యూరు : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. బుధవారం కొయ్యూరు ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన గూడెంకొత్తవీధి జెడ్పీటీసీ కిముడు శివరత్నం ఆదేశాలతో ఆమె భర్త ఎం.విశ్వేశ్వరరాజు, ఎంపీపీ బడుగు రమేష్, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జె.రాజులమ్మ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రేగటి ముసిలినాయుడు పలు పాఠశాలల్లో ప్రచారం చేశారు. కాకరపాడు గురుకుల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సత్యరాజ్, అధ్యాపకులను కలిసి సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాలని కోరారు. కొయ్యూరు గురుకుల పాఠశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుతో మాట్లాడారు. అక్కడి సిబ్బందిని వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించాల్సిందిగా కోరారు. ఈ ప్రచారంలో సర్పంచ్‌లు నత్తూరు సోమన్నదొర, ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్, ఎమ్మెల్సీ టీం సభ్యులు రాజుబబు, బల్ల ప్రసాద్ పాల్గొన్నారు.

జి.మాడుగుల: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ మత్స్యకొండంనాయుడు, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర కోరారు. మండలంలోని భీరం, నుర్మతి, బొయితిలి పంచాయతీల్లోని గ్రామాల్లో విస్తృత ప్రచారం సాగించారు. పట్టభద్రుల ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లసంగి మాలన్న, మైనార్టీ సెల్ జిల్లా కన్వీనర్ నాగూరుబాబు, భీరం, నుర్మతి కన్వీనర్లు వి.రమణ, కె.పోతురాజు, కె.సోంబాబు, ఉప సర్పంచ్ వరలక్ష్మి, మాజీ ఎంపీటీసీ బ్రహ్మాలింగం, మాజీ సర్పంచ్ ఎం.ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణబాబు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి అందరూ సహకరించాలని హుకుంపేట జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం ఓటర్లను అభ్యర్థించారు. బుధవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి లోతేరు పంచాయతీ పెదవలస, అడారి, లండిగూడ, తొరడంబువలస, సిరోసుగూడ, అనంతగిరి మండలం కోనపురం పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులు గ్రామాల్లో పట్టభద్రులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రాంచందర్, సర్పంచ్ ఉపేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు జర్రా రఘునాథ్, సత్రుగున్, రామ్మూర్తి, మోహన్‌దాస్, మత్స్యరాజు, నైని సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల పంపిణీ



కొసోంగుడ పాఠశాలలో విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు విజయ

డుంబ్రిగుడ : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లను బుధవారం కించుమండ పంచాయతీ కొసోంగుడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంపీటీసీ గుజ్జెల విజయ చేతుల మీదుగా పంపిణీ చేశారు. విద్యా బోధన తీరుపై విద్యార్థుల్ని ప్రశ్నించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందిస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు తెలిపారు. పేదలు ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబూరావు, చిరంజీవి, పాఠశాల హెచ్‌ఎం విలియం కేరీ తదితరులు పాల్గొన్నారు.

షాపుల వివరాల సేకరణతో వర్తకుల్లో ఆందోళన



సచివాలయంలో వివరాలు సేకరిస్తున్న ఆర్‌ఐ

సీలేరు: సీలేరు మార్కెట్ సెంటర్లో షాపుల వివరాలను మండల రెవెన్యూ అధికారులు బుధవారం సేకరించడంతో వర్తకుల్లో ఆందోళన చెలరేగింది. స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో షాపుల వివరాలు సచివాలయానికి తెలపాలని మేసేజ్ వచ్చింది. ఎత్తిపోతల పథకం ద్వారా జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించేందుకు సీలేరులో కొంత మేర పోతుందని, అందులో మార్కెట్ సెంటర్ కూడా ఉందన్న ప్రచారం ఇప్పటికే జరుగుతోంది. ప్రాజెక్టుకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ వచ్చే నెల 1న నిర్వహించనున్నారు. ఈలోగా మండల ఆర్‌ఐ మహదేవ్, వీఆర్వో శ్రీనివాస్ వివరాలు సేకరించడంతో ఏం జరుగుతుందోనని వర్తకులు సచివాలయానికి పరుగులు తీశారు. దీనిపై ఆర్‌ఐని ప్రశ్నించగా తహసీల్దార్ ఆదేశాల మేరకు వివరాలు సేకరించామన్నారు. తహసీల్దార్ రాజశేఖర్‌ను వివరణ కోరగా జేఏసీ నాయకులు స్పందన కార్యక్రమంలో సీలేరులో అక్రమంగా కాటేజీలు, షాపులు నిర్మించారన్న ఫిర్యాదుపై మాత్రమే వివరాలు సేకరించినట్టు తెలిపారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

మంచినీటి బావిని శుభ్రం చేయండి



అడ్డతీగలలో అపరిశుభ్రంగా ఉన్న మంచినీటి బావిని పరిశీలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల : అడ్డతీగల గ్రామానికి మంచినీటిని సరఫరా చేసే పెద్ద బావి వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తక్షణమే తొలగించాలని పంచాయతీ అధికారులను ఎంపీడీవో కె.బాపన్నదొర ఆదేశించారు. గ్రామస్తుల వినతి మేరకు మంచినీటి బావిని ఇతర అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. మంచినీటి బావి అంతా తుప్పలతో నిండిపోయి, నీటి సరఫరాకి వినియోగిస్తున్న పైప్‌లైన్లకు రంధ్రాలు పడి నీరు వృథాగా పోతున్న విషయాన్ని గమనించారు. వెంటనే తుప్పల్ని తొలగించి, పైప్‌లైన్లు మార్చాల్సిందిగా ఈవోపీఆర్డీ చినబాబును, గ్రామ కార్యదర్శి అనురాధను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సూచనల మేరకు ఆయా పనులు చేపట్టాలన్నారు.

అసాంఘిక చర్యలతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు



మడుగుకోటలో ప్రజలతో మాట్లాడుతున్న మహిళా పోలీసు పాడియం దీప

వై.రామవరం : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి నిందితులుగా ముద్రవేసుకుని గ్రామానికి చెడ్డపేరు తేవద్దని స్థానిక గ్రామ సచివాలయ మహిళా పోలీసు పాడియం దీప హితవుపలికారు. మండలంలోని వై.రామవరం సచివాలయం పరిధిలోని మడుగుకోటలో బుధవారం ఆమె గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు చెడు వ్యసనాలను విడనాడి సన్మార్గంలో పయనించాలని సూచించారు. నాటుసారా, జూదం, కోడిపందేల జోలికి పోవద్దని హెచ్చరించారు. అధిక కూలీకి ఆశపడి గంజాయి అక్రమార్కులకు సహకరించి, జైలుపాలు కావొద్దన్నారు. సీఐ వై.రాంబాబు, ఎస్సై ఎం.సంతోష్‌కుమార్‌ల ఆదేశాల మేరకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. బాల్య వివాహాలకు తావివ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. గ్రామంలోని సమస్యలను అడిగితెలుసుకున్నారు.

తాపీ మేస్త్రులకు నగదు సాయం



తాపీ మేస్త్రులకు నగదు సాయం అందిస్తున్న వినాయక తాపీ పనివారల సంక్షేమ సంఘం సభ్యులు

అడ్డతీగల : వివిధ ప్రమాదాల్లో గాయపడి పనులకు వెళ్లలేని స్థితిలో ఉన్న నలుగురు తాపీ మేస్త్రులకు వినాయక తాపీ పనివారల సంక్షేమ సంఘం తరపున ఒక్కొక్కరికీ రూ.2 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన నెలవారీ సమావేశంలో వారికి నగదును అందించారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమశాఖ ద్వారా నిధులు విడుదల చేస్తే మరికొందరికి సాయం అందుతుందని సంఘం రంపచోడవరం డివిజన్ అధ్యక్షులు చీకట్ల శామ్యూల్ అన్నారు. కార్మిక సంక్షేమానికి నిధులు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడ్డతీగల మండల అధ్యక్షులు చింతోజి అబ్బులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్నవారందరికీ పని



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల : జాబ్‌కార్డు ఉన్న ప్రతి వేతనదారుకి ఉపాధి పని కల్పించాలని ఎంపీడీవో, ఉపాధి హామీ ఇన్‌చార్జ్ కె.బాపన్నదొర అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్‌కి ఇచ్చిన లేబర్ టార్గెట్‌ను మార్చి 2023 నాటికి పూర్తిచేయాలన్నారు. పని కేటాయింపులో అలక్ష్యం వహించరాదన్నారు. ఎప్పటికప్పుడు లేబర్ రిపోర్ట్‌తో పాటు బడ్జెట్ తయారుచేసుకోవాలని సూచించారు. ఆధార్ సీడింగ్ చేపట్టాలన్నారు. ఎక్కువ కుటుంబాలకు 100 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ప్రతి పనికీ గ్రామ పంచాయతీ తీర్మానాలు తీసుకోవాలన్నారు. మేట్‌లకు క్రమం తప్పకుండా శిక్షణ ఇవ్వాలన్నారు. సమావేశంలలో ఏపీఎం మణికుమారి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

దొరమామిడిలో పశు వైద్యశిబిరం



పశు వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్న పశు సంవర్థకశాఖ సిబ్బంది

గంగవరం : దొరమామిడిలో సీనియర్ వెటర్నరీ ఆఫీసర్ అప్పన్నబాబు ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్లు వేశారు. దొరమామిడి సర్పంచ్ చంద్రకళ, ఆముదాలబంద ఎంపీటీసీ సభ్యుడు పండా ఆదినారాయణ, సచివాలయ పశు సంవర్థకశాఖ సహాయకులు బషీర్‌బీబీ, వెంకటేశ్వర్లు, క్రాంతి పాల్గొన్నారు.

మండలానికి 11 వేల గాలి కుంటు టీకా డోసులు

రాజవొమ్మంగి : మండలంలో గాలికుంటు వ్యాధి నివారణకు 11 వేల టీకా డోసులు వచ్చాయని స్థానిక పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ తరుణ్ తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా తొలిరోజు బుధవారం మండంలోని లాగరాయి, బడదనాంపల్లి గ్రామాల్లో 300 పశువులకు టీకాలు వేసినట్టు పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకు మండలంలోని అన్ని గ్రామాల్లోని పశువులకు ఈ టీకాలు వేస్తామన్నారు.